విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 12, ఏప్రిల్ 2025

ఇంటి స్థలాలు ఇచ్చేవరకు పోరాటం

ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన

విశాలాంధ్ర-డోన్ : అర్హులైన పేద ప్రజలకు ఇంటి పట్టాలతో పాటు గృహాన్ని మంజూరు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా శుక్రవారం డోన్ ఆర్డీఓ కార్యాలయం దగ్గర నిరసన దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి సీపీఐ పట్టణ కార్యదర్శి మోటారాముడు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పీ.సుంకయ్య, కే.రాధాకృష్ణ, మండల కార్యదర్శి బి.నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలని డిమాండ్ చేశారు. గత నవంబర్ 18వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఇండ్లు లేని లబ్ధిదారులతో వ్యక్తిగత అర్జీలు సేకరించి డోన్ ప్రాంతంలో గ్రామీణ ప్రాంతంలో స్వయానా అర్జీదారులే డోన్ మండల తాహసిల్దార్ కి సమర్పించారన్నారు. వాటిని తక్షణమే ఇండ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు చూపించాలని వారు కోరుతున్నామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామీణ ప్రాంతాలకు పట్టణ ప్రాంతాలలో ఇల్లు లేని నిరుపేదలకు మేము అధికారంలోకి వస్తే ఇంటి స్థలాలతో పాటు ఇంటి నిర్మాణం కూడా చేపడతామని చెప్పారన్నారు. అధికారం చేపట్టి దాదాపుగా తొమ్మిది మాసాలు కావస్తున్న ఇంతవరకు హామీని నెరవేర్చలేదని, ప్రజలు పట్టణాలల్లో ఇంటికి కిరాయి కట్టుకోలేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, ప్రజానీకం అమాంతంగా ఇంటి బాడుగలు పెరిగి కట్టలేక అల్లాడిపోతున్న తరుణంలో ఇప్పుడు ఉన్నటువంటి నిత్యవసర ధరలు ఆకాశమంటుతున్న పట్టించుకునే నాధుడే లేదని వారు ఆందోళన చెందుతున్నారు. గ్యాస్ ధరలు పెంచి పేద ప్రజల పైన భారాలు మోపుతున్నారు వాటి ధరలన్నీ నియంత్రించాలని కూటమి ప్రభుత్వానికి హెచ్చరిస్తున్నామన్నారు. గత క్యాబినెట్ మీటింగులో ప్రతి ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు ఇవ్వాలని క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. డోన్ ఆర్డీఓ స్పందించారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ప్రతి ఒక్కరికి ఎంక్వయిరీ చేసి తప్పకుండా మీరు ఇచ్చిన వ్యక్తిగత అర్జీలు అందరికీ ఎవరికైతే ఇల్లు లేదో వారి కచ్చితంగా ఇస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి హుస్సేన్ పీరా, పట్టణ సహాయ కార్యదర్శి రామ్మోహన్,మండల కార్యవర్గ సభ్యులు కే చంద్రశేఖర్, అబ్బాస్, బాలమద్దయ్య, చేతి వృత్తిదారుల సమైక్య జిల్లా కార్యదర్శి రామ్మోహన్, పృథ్వి కుమార్,మనోజు, మహిళా సమైక్య మండల కార్యదర్శి అమృత రెడ్డి, ఉపాధ్యక్షురాలు జే.మాధవి, సీపీఐ నాయకులు శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిందే..

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : జిఓ 107, 108 రద్దు చేయాలని, యువ గళం పాదయాత్రలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సూర్య ప్రతాప్ డిమాండ్ చేశారు. శుక్రవారం నంద్యాల పట్టణంలో నిట్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో సూర్య ప్రతాప్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నీట్ పరీక్ష రాస్తున్న విద్యార్థులకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని, గత వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 107,108ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైద్య విద్యను పేదలకు దూరం చేసే విధంగా జీవో నెంబర్ 107, 108 తీసుకువచ్చి కోట్ల రూపాయలకు అమ్ముతుండడంతో అర్హులైన పేద విద్యార్థులకు మెడికల్ సీట్లు రావడంలేదని, రిజర్వేషన్ ప్రకారం విద్యార్థులు వారికి రావాల్సిన కోటా సీట్లు కోల్పోతున్నారని, ఇప్పటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆ జీవోలను రద్దు చేస్తూ ప్రతి పేద విద్యార్థికి వైద్య విద్యను అందే విధంగా చూస్తామని హామీ ఇచ్చారని గుర్తుకు చేశారు. తక్షణమే పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే జీవో నెంబర్ 107, 108 రద్దు చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను ఆపాలని, లేనిపక్షంలో విద్యార్థులను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు శశిధర్ రెడ్డి, ప్రవీణ్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

జంగిల్ క్లియరెన్స్ తనిఖీ చేసిన మంత్రి

విశాలాంధ్ర - బనగానపల్లె : బనగానపల్లె పట్టణం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఎస్ఆర్బిసి కెనాల్‌లో చేపట్టిన జంగిల్ క్లియరెన్స్ పనులను రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. శుక్రవారం ఈ సందర్భంగా గుత్తేదారుకు పలు సూచనలు సూచించారు. పండ్లాపురం నంద్యాల రహదారిలో నేషనల్ హైవే కల్వర్టు పనులను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ అమర్ నాథ్ రెడ్డి, విజయ్ భాస్కర్ రెడ్డి, పిఏ మురళీమోహన్ రెడ్డి సీఐ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

విశాలాంధ్ర- నందికొట్కూరు : పాఠశాల దశ నుంచి విద్యార్థులు కష్టపడి చదువుకొని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని చైతన్య పాఠశాల ఏజీఎం.సురేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక మద్దూర్ నగర్‌లో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో చదువుతున్న 8మంది విద్యార్థులు జాతీయస్థాయిలో నాసా బహుమతులను కైవసం చేసుకోవడం జరిగిందని పాఠశాల ప్రిన్సిపల్ దీప తెలిపారు. ముఖ్యఅతిథిగా చైతన్య పాఠశాల ఏజీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అంతరిక్ష పరిశోధనా రంగంలో విజ్ఞాన అభివృద్ధి సాధించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడతాయని నాసాబహుమతులను చైతన్య విద్యార్థులు గెలుచుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఎంపికైన విద్యార్థులకు బహుమతులను అందజేసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కోటయ్య చౌదరి,కోఆర్డినేటర్ రమణయ్య, డీన్ ఉమామహేశ్వరరావు,ఏవో గోపాల్‌రెడ్డిఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

మండలం వ్యాప్తంగా మోస్తారు వర్షం

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: మండలంలోని ఆయా గ్రామాలలో శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఉరుములు మెరుపులతో జల్లులు కురవడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. మండుతున్న ఎండలు ఉక్క పోతతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగింది. ఉరుముల దాటికి ప్రజలు ఆందోళన చెందారు. రెండు రోజులుగా సాయంత్రం అయ్యేటప్పటికీ మేఘాలు కమ్ముకొని ఉరుములు మెరుపులతో కూడిన చిరుజల్లులకె పరిమితం కావడంతో ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగి ఉక్కపోత పెరుగుతుందని రైతన్నలు భావిస్తున్నారు. మండలంలోని తదితర గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. అప్పుడప్పుడు కురుస్తున్న చిరుజల్లులతో మిర్చి, మొక్కజొన్న తదితర ధాన్యాలను ఆరబోసుకున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సమయ పాలన పాటించండి

విశాలాంధ్ర - చాగలమర్రి : సచివాలయాల సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా పంచాయతి అధికారి జమీవుల్లా ఆదేశించారు. శుక్రవారం మండలంలోని మద్దూరు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వివిద రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో సచివాలయ సిబ్బందే కీలకమన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి మనపై నమ్మకం కలిగేలా పనిచేయాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4 సర్వే, మ్యాన్ మిస్సింగ్ సర్వే,ప్రజాసమస్యల పరిష్కార వేదికలపై ప్రజాభిప్రాయ సేకరణలపై సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకొని పలు సూచనలను సలహాలను ఆయన అందజేసారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర కార్యదర్శి చిన్నబ్బి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర- రుద్రవరం : సూర్య ఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి నాగరాజు, ఎంపీడీవో భాగ్యలక్ష్మి శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ భవనంలో సూర్య పథకంపై వారు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ సామాజిక వర్గాల వారికి కేంద్ర ప్రభుత్వం ఉచితంగా సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవచ్చని ,వెనుకబడిన తరగతులకు 30% శాతం సబ్సిడీస్తుందని తెలిపారు. సోలార్ పథకం కావలసినవారు స్థానిక విద్యుత్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ నాగరాజు, విశాఖ ఏ ఈ అనిల్ ,విద్యుత్ సబ్ ఇంజనీర్ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శులు ,ఇంజనీర్ అసిస్టెంట్లు, విద్యుత్ సిబ్బంది సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

విశాలాంధ్ర - కొత్తపల్లి : మండలంలోని ఉపాధి హామీ కూలీలకు పెండింగ్లో ఉన్న వేతనాలు తక్షణమే విడుదల చేయాలని సిపిఐ మండల కార్యదర్శి కేతం వెంకట శివుడు యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం కొత్తపల్లి గ్రామంలో ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న ఉపాధి కూలీలు పనులు చేస్తున్నారు కానీ వేతనాలు రావడం లేదన్నారు. పెండింగ్లో ఉన్న వేతనాలు విడుదల చేసి కూలీల కుటుంబాలు రోడ్డున పడకుండా ఆదుకోవాలి అన్నారు. ఎండలు ఎక్కువగా ఉండటం వల్ల 10గంటల లోపు కూలీలను ఇంటికి పంపించే విధంగా అధికారులు చూసుకోవాలన్నారు. పని ప్రదేశంలో నీరు, నీడ, పలు సౌకర్యాలు కల్పించాలన్నారు. సిపిఐ నాయకులు నాగ శేషులు, వెంకటేశ్వర్లు, భీమలింగం భాస్కర్ ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు భూముల్లో ఇళ్ల స్థలాలివ్వాలి

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్ : నంద్యాల పట్టణం బాలాజీ కాంప్లెక్స్‌లో ఉన్న సర్వేనెంబర్ 2183, 2179లోని వక్ఫ్ బోర్డ్ భూములను ప్రభుత్వ వక్ఫ్ బోర్డు అధికారులు స్వాధీనం చేసుకున్నారని వాటిని వెంటనే అరులైన నిరుపేద ముస్లింలకు ఇళ్ళస్థలాలుగా ఇవ్వాలని ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.బాబా ఫక్రుద్దీన్ కోరారు. శుక్రవారం సిపిఐ పట్టణ కార్యదర్శి కె. ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సిపిఐ నంద్యాల సమితి ఆధ్వర్యంలో 2017లో పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్ వద్ద ఉన్న 2179, 2183 సర్వే నెంబర్లలోని 4ఎకరాలలో అర్హులైన నిరుపేద ముస్లిం లకు ఇళ్ల స్థలాలకై భూ పోరాటం ద్వారా గుడిసెలు వేసుకోవడం జరిగిందని అన్నారు. ఈ విషయమై ముత్తవలి రజాక్ మియా, సిపిఐ నాయకులపైన కేసు నమోదు చేయడం జరిగిందని 5సంవత్సరాలుగా కోర్టులు చుట్టూ తిరగడంతో అప్పటి నంద్యాల శాసన సభ్యులు శిల్ప మోహన్ రెడ్డి ఆ ప్రాంతంలోనే నిరుపేద ముస్లింలకు ఇళ్ల స్థలాలుగా ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. స్థానిక న్యాయశాఖ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ నిరుపేదల పట్ల దయా హృదయం కలవారని అర్హులైన నిరుపేదల ముస్లింలను గుర్తించి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఇన్సాఫ్ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్.జిలాని భాష, సిపిఐ జిల్లా సమితి సభ్యులు డి.శ్రీనివాసులు, జి.హరినాథ్, ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షుడు భూమని శ్రీనివాసులు పాల్గొన్నారు.

పీఎం సూర్య ఘర్ పథకంపై అవగాహన కల్పించండి

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎంపీడీవో ప్రసాద్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం నందు ఆయన విద్యుత్ ఏఈ పకీరయ్యతో కలిసి విద్యుత్ శాఖ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో పీఎం సూర్య ఘర్ పథకంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ద్వారా దేశ వ్యాప్తంగా కోటి మంది ప్రజలకు సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకునేందుకు రాయితీని కల్పిస్తున్నదని తెలిపారు. ఈ పథకం ధర ప్రతి కుటుంబం 300 యూనిట్ల వరకు ఫ్రీ విద్యుత్ పొందవచ్చు అని తెలిపారు. ఈ పథకం కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలి ఎంత సబ్సిడీ లభిస్తుంది తదితర వివరాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా చూడాలన్నారు. ఒక్కో ఇంటిపై గరిష్టంగా మూడు కిలోవాట్లకు రూ.78 వేల సబ్సిడీని అందిస్తుందని తెలిపారు. ఒక్క కిలోవాట్‌కు రూ30 వేలు, రెండు కిలోవాట్ విద్యుత్తుకు రూ.60వేలు, మూడు కిలోవాట్ల విద్యుత్కు రూ.78వేలు సబ్సిడీని ప్రభుత్వం అందిస్తుందన్నారు. సోలార్ ఏర్పాటు చేసుకోవడానికి రూ.1.45 లక్షల ఖర్చవుతుందని అందులో కేంద్ర ప్రభుత్వం గరిష్టంగా రూ.78 వేల రాయితీ అందిస్తుందని తెలిపారు. మిగిలిన మొత్తాన్ని కూడా పూచికత్తు అవసరం లేకుండా తక్కువ వడ్డీకే బ్యాంకుల ద్వారా రుణం పొందవచ్చని తెలిపారు. పీఎం సూర్య ఘర్ పోర్టర్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ పథకం పేదలకు మధ్యతరగతి వారికి ఎంతో ఉపయోగపడుతుందని వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ లక్ష్మణ్, సిబ్బంది సురేష్, రమణారెడ్డి, విష్ణు, కళ్యాణ్ పంచాయతీ కార్యదర్శులు అమరావతి, భార్గవిలత తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల అభ్యున్నతి కృషి చేసిన పూలే

జి.రాజకుమారి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిబా పూలే అని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. శుక్రవారం శ్రీ మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా నంద్యాల బొమ్మలసత్రం సమీపంలో ఉన్న సమీకృత ప్రభుత్వ బిసి బాలికల వసతి గృహంలో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంతోత్సవ సభ కార్యక్రమంలో రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, జిల్లా కలెక్టర్‌తో కలిసి మహాత్మా జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, మహిళల విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త , మానవతావాది అంటూ పూలే సేవలను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ కుల, మత, వర్గ విభేదాలు లేని సమాజం కోసం కృషి చేసిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని అన్నారు. బిసి కార్పొరేషన్ ద్వారా 2156 ఋణాలు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 954 ఋణాలు, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా 1920 ఋణాలు ఇచ్చి వారికి స్వయం ఉపాధి ద్వారా ఋణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 514 యూనిట్ల లబ్ధిదారులకు అనుమతులు మంజూరు చేస్తూ 12కోట్ల 37లక్షల50వేల రూపాయల సబ్సిడీ అందరీ సహకారంతో మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో భాగంగా బిసి, ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ల ద్వారా 514 మంది లబ్దిదారులకు స్వయం ఉపాధి పథకం క్రింద 12.37 కోట్ల మెగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి ఆర్.ఓబులేసు, బిసి కార్పొరేషన్ ఈడి జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

13న ప్రవేశ పరీక్ష

విశాలాంధ్ర - డోన్ : అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 2025-2026 విద్యా సంవత్సరానికి ఐదవ తరగతిలో ప్రవేశానికి, ఇంటర్ ప్రథమ సంవత్సరం చేరబోయే విద్యార్థులకు ఈ నెల13న ప్యాపిలి/డోన్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఏఆర్ సుస్మిత తెలిపారు. ఐదవ తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుండి 12:30 వరకు, ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు 2 నుండి 4:30 గంటల వరకు ప్రవేశ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ హాల్ టికెట్ తీసుకొని సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని పిలుపునిచ్చారు.

30లీటర్ల నాటుసార స్వాధీనం

విశాలాంధ్ర- కొలిమిగుండ్ల : మండలంలోని కోటపాడు గ్రామంలో చిన్న రాయుడు నుండి 30లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు సిఐ రమేష్ బాబు శుక్రవారం తెలిపారు. గ్రామంలోని నీళ్ల ట్యాంకు వద్ద చిన్న రాయుడునాటు సారా విక్రయిస్తుండగా తమ సిబ్బందితో దాడి చేశామన్నారు. అతని వద్ద నుండి 30 లీటర్ల నాటుసారని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించిందని తెలిపారు.

పూలేకు భారతరత్న ప్రకటించాలి

విశాలాంధ్ర - వెలుగోడు : మహాత్మా జ్యోతి రావు పూలే 198వ జయంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని వేంపెంట సర్కిల్ నందు మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూల మాల వేసి జాతీయ బి.సి. సంక్షేమ సంఘము ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అబ్దుల్ కలాం, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు యాదవ్ మాట్లాడుతూ అణగారిన ప్రజల అభ్యున్నతికి, బాలికల విద్యాభివృద్ధికి, సమాజంలో ఉన్న రుగ్మతలను పోగొట్టడానికి విశేష కృషి చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే దంపతులకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి, బీసీ నాయకులు అంకన్న, నారాయణ, రాఘవేంద్ర ఇంతియాజ్, రాము, మధుబాబు, రంగయ్య, రవికుమార్, శేఖర్ పాల్గొని విజయవంతం చేశారు. అలాగే వెలుగోడు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ వేల్పుల జైపాల్, గ్రామ కార్యదర్శి సుంకన్న ఆధ్వర్యంలో వైసిపీ నాయకులు పాల్గొని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు, నాయకులు పూలే విగ్రహానికి పూల మాల వేశారు.

కౌలు రైతులు కార్డులను తీసుకోవాలి

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: మండలంలోని కౌలు రైతులు తమ గ్రామాలలో రైతు సేవ కేంద్రాలు లేదా గ్రామ రెవెన్యూ అధికారులు వద్దకు ఆధార్ కార్డు, భూ సంబంధిత రికార్డును తీసుకొని వెళ్లి కౌలు కార్డులను పొందవలసిందిగా మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 900 మందికిపైగా కౌలు రైతులు ఉన్నారని, భూయజమానులు కౌలు రైతులకు కౌలు కార్డులు ఇవ్వడంలో సహకరించాలని కోరారు. కౌలు కార్డు కాల పరిమితి 11నెలలు వరకు ఉంటుందని, ఈ కార్డుల వలన కౌలు రైతులకు ఎరువులు, సబ్సిడీ విత్తనాలు, పంట రుణాలు, పంట నష్ట పరిహారం, పంటల భీమా తదితర వాటిని పొందవచ్చునని తెలిపారు.

ఆలయ అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర - అవుకు : ఎర్రమల కొండల్లో స్వయంభుగా వెలసిన శ్రీ లక్ష్మీ కంబగిరి స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. శ్రీ కంబగిరి స్వామి తిరు కళ్యాణ మహోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు స్వామివారి కళ్యాణం సందర్భంగా పట్టు వస్త్రాలు, తలంబరాలను రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి,సతీమణి ఇందిరమ్మలు సమర్పించారు. ముందుగా ఆలయం వద్దకు చేరుకున్న మంత్రి దంపతులకు ఈవో రామకృష్ణ ఆధ్వర్యంలో పూరోహితలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరము ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. సీసీ రోడ్డు నిర్మాణం, కళ్యాణ మండపం ,నీటి వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇస్రా నాయక్ తండా నుండి కంబగిరి స్వామి ఆలయం వరకు 10 కోట్ల రూపాయలతో బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతున్నామని అన్నారు. సొంత నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. గూడాల సోదరులు మురళీధర్ రెడ్డి, ప్రతాపరెడ్డి, చల్లా విజయ భాస్కర్ రెడ్డి, మోట్ల రామిరెడ్డి, మారం భాస్కర్ రెడ్డి, వంగల పరమేశ్వర్ రెడ్డి, ఉగ్రసేనారెడ్డి, మల్లికార్జునరెడ్డి, వెంకటరమణ నాయక్, అరుణ్ కుమార్ నాయక్, దంతల రమణ, తిక్కన్న తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాలు తనిఖీ

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : మండలంలోని పలు వ్యవసాయ విత్తన దుకాణాలను శుక్రవారం వ్యవసాయ అధికారుల బృందం తనిఖీ చేశారు. విజయవాడ వ్యవసాయ కమిషనరేట్ నుండి వచ్చిన ఏడిఏ శ్రీనివాసాచార్యులు, ఎంఏఓ శివరామకృష్ణ లతో కూడిన బృందం తనిఖీ చేశారు. విశ్వంభర ఆగ్రో ఏజెన్సీస్ నందు ఉన్న పత్తి కిలాడి, తడాఖా విత్తనాలను అక్కడే హెచ్టి టెస్ట్ చేసి పరిశీలించగా నెగిటివ్ ఫలితాలు రావడం జరిగింది. విష్ణు ప్రియ సీడ్స్, మహాలక్ష్మి అగ్రి సీడ్స్ దుకాణాలను కూడా తనిఖీ చేశారు. వ్యవసాయ దుకాణాల్లో నాణ్యమైన విత్తనాలు అమ్మాలని, ప్రతి రైతుకు తప్పకుండా బిల్లు ఇవ్వాలని, స్టాక్ బోర్డు, స్టాక్ రిజిస్టర్ మైంటైన్ చేయాలని, ఇన్వాయిస్ బిల్లు బుక్కులు అన్ని కూడా కరెక్ట్‌గా ఉండాలని ఆదేశించారు. వారితోపాటు ఆళ్లగడ్డ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు రామ్మోహన్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి కిషోర్ కుమార్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి హుస్సేన్ బాషలు పాల్గొన్నారు.

నేడు సబ్ రిజిస్టార్ సేవలు

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలకు క్రయవిక్రయదారులకు ఈసీ నకలు దస్తావేజులు కావలసిన వారికి నేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం యధావిధిగా సేవలు అందిస్తుందని సబ్ రిజిస్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ డిప్యూటీ జనరల్ ఇన్స్పెక్టర్ స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ వారి ఆదేశాల మేరకు 2వ శనివారం సైతం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సెలవు ఉండదని తమ కార్యాలయ పరిధిలో క్రయవిక్రయాలు కొనసాగు తాయని అవసరమైన ప్రతి ఒక్క సేవలు అందించేందుకు సబ్ రిజిస్టార్‌తో పాటు కార్యాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తారని తెలిపారు.

డిజిటల్ లిటరసీపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - పాణ్యం : శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల (అటానమస్)లోని ఎమ్‌బీఏ భాగం శుక్రవారం డిజిటల్ లిటరసీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సెషన్‌కు స్పీకర్‌గా ఎకె హరి నారాయణ, అసిస్టెంట్ జనరల్ మేనేజర్-యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బెంగళూరు వ్యవహరించారు. అతను ప్రస్తుతం జరుగుతున్న వివిధ రకాల డిజిటల్ మోసాల గురించి, వీటిని ఎదుర్కొన్నప్పుడు మనం ఎవరికి ఫిర్యాదు చేయాలి. ఎలా ఫిర్యాదు చేయాలి విషయాల గురించి వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.సుబ్రమణ్యం మాట్లాడుతూ ఈ డిజిటల్ అక్షరాస్యత గురించి అవగాహన పొందడం ద్వారా, విద్యార్థులు తమను తాము రక్షించుకోవడమే కాకుండా వారి చుట్టూ ఉన్న మోసాల నుండి కూడా రక్షణ పొందవచ్చు అంతే కాక ఈ రోజు సెషన్ ద్వార విద్యార్థులు బ్యాంకింగ్ రంగం గురించి బ్యాంకింగ్‌లో కెరీర్‌ను ఎలా ప్రారంభించాలో అవగాహన పొందారు అని పేర్కొన్నారు. ఎమ్‌బీఏ విభాగాధిపతి డాక్టర్ ఎకె నీరజా రాణి మాట్లాడుతూ ఎమ్‌బీఏ విద్యార్థులు ఈ మోసపూరిత కార్యకలాపాలను నివారించడానికి బ్యాంకులు ఎలా పనిచేస్తున్నాయో సమాచారం తెలుసుకున్నారు. అని, అంతేకాక, బ్యాంకింగ్ రంగాలలో ఉద్యోగాలు పొందడానికి ఎలా సిద్ధం కావాలి బ్యాంకింగ్ రంగాలలో ఉద్యోగాలు పొందడానికి అందుబాటులో ఉన్న అదనపు కోర్సులు ఏమిటి అనే విషయాలు విద్యార్థులకు చాలా ప్రయోజనకరంగా వివరించారు అని పేర్కొన్నారు.

ఉత్కంఠభరితంగా న్యాయవాద ఎన్నికలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల బార్ అసోసియేషన్ ఎన్నికలు ఉత్కంఠ భరితంగా శుక్రవారం కొనసాగాయి. అభ్యర్థుల మధ్య పోటీ ఎక్కువగా ఉండటంతో టెన్షన్ వాతావరణం కొనసాగింది. పోలీసుల పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుండి బార్ అసోసియేషన్ ఎన్నికలు ప్రారంభమయ్యాయి మొత్తం 418ఓట్లు ఉండగా 389ఓట్లు నమోదయ్యాయి. 3గంటల నుండి 5గంటల వరకు ఓట్ల లెక్కింపులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా హుస్సేన్ బాష, జనరల్ సెక్రెటరీగా ఎంఆర్ కృష్ణారెడ్డి, జాయింట్ సెక్రెటరీగా బాలు నాయక్, స్పోర్ట్స్ కల్చరల్ సెక్రటరీగా చిన్న లింగమ య్య గెలుపొందడంతో, అభిమానులు పూలదండలతో వారిని ఘనంగా సత్కరిస్తూ కేరింతలు వేస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బార్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తామని, నంద్యాల జిల్లాకు రావాల్సిన కోర్టు బెంచ్ కోసం కృషిచేస్తామని, న్యాయవాదులకు ఏఅవసరం వచ్చి మేము అండగా ఉంటామని తెలిపారు.

వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలి

విశాలాంధ్ర - పాములపాడు : వక్ఫ్ ఆస్తులకు చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా శుక్రవారం ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో వామపక్ష పార్టీల, ప్రజా సంఘాల నాయకులు మజీద్ ఏ హాస్మి ఇమామ్ షేక్.ఆరిఫ్ భాష, జామియా మసీద్ ఇమామ్ సుభాన్ మౌలానాల, ముస్లిం సోదరులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.షేక్షావలి, కాంగ్రెస్ పార్టీ నందికొట్కూరు నియోజవర్గం మహిళా అధ్యక్షురాలు టీ.షాజహాన్ బేగం, సిపిఐ నాయకులు రమేష్, సిపిఎం పార్టీ నాయకులు డి.స్వామన్న, మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి,అంకన్న వైఎస్ఆర్సిపి నాయకులు మండలకో అప్డేట్ మెంబర్ సయ్యద్, ముర్తుజాఅలి, నూర్ భాషా సంఘం నాయకులు, ప్రజా సంఘాల నాయకులతో కలిసి హాస్మి మసీదు నుండి వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని ర్యాలి చేపట్టారు. అనంతరం తహసిల్దార్ జి.సుభద్రమ్మకు వినతి పత్రం అందజేశారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 12, ఏప్రిల్ 2025

ఘనంగా ఏఐకెఎస్ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఏఐకేఎస్ 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని కర్నూలు నగరంలోని సీఆర్ భవన్ నందు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సీపీఐ నగర సహాయ కార్యదర్శి సి.మహేష్ అధ్యక్షత వహించగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం ఏఐకేఎస్ పథకాన్ని ఆవిష్కరణ ఆవిష్కరించారు. సందర్భంగా కె.జగన్నాథం మాట్లాడుతూ 1936లో ఏఐకేఎస్ స్థాపించబడిందన్నారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో తమిళనాడు రాష్ట్రంలో నాగ పట్నంలో 30వ జాతీయ మహా సభలు జరుగుతున్నాయన్నారు. దేశం నలు మూలల నుండి రైతు యోధులు, రైతు నాయకులు ఈ మహాసభ హాజరవుతున్నా రన్నారు. రైతుల ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి రాబోయే రోజుల్లో రైతు మరిన్ని రైతు ఉద్యమాలు చేపట్టేందుకు తీర్మా ణాలు చేసి పోరాట కార్యక్రమాన్ని రూపొందిస్తామన్నారు అనంతరం చేతి వృత్తుదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, సీపీఐ నగర కార్యదర్శి మాట్లాడారు పి.రామకృష్ణారెడ్డి తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు పుల్లన్న, దొడ్డి పాడు బాష, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు నాగరాజు, నాయకులు మాణిక్యం, బాబయ్య,రాము తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు పూలే : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, సమాజ సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావుపూలే అని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా కొనియాడారు. శుక్రవారం కర్నూలు నగరంలోని బిర్లా గేట్ వద్ద మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహానికి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు, తదితరులు పూలమాలవేసి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1827 సంవత్సరం ఏప్రిల్ 11 వ తేదీ పుట్టిన మహాత్మా జ్యోతిరావు పూలే గురించి దాదాపు 198 సంవత్సరాల తర్వాత మాట్లాడుకుంటూ, ఈరోజు ఆయన జయంతిని పండగలాగా రాష్ట్రమంతా, దేశమంతా చేస్తున్నారంటే ఆయన సమాజానికి ఎంతో మేలు చేసిన వ్యక్తి అని, అలాంటి మహనీయుని ఆశయాలకు అందరు పునరంకితం కావాలని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్, రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ విజయ్, బోయ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మురళి, బోయ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథ్, కురువ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటరాముడు, నాయి బ్రాహ్మణ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ విజయ్, వాల్మీకి సంఘం స్టేట్ డైరెక్టర్ సంజమ్మ, రాష్ట్ర దళిత సమైక్య అధ్యక్షుడు శ్రీనివాసులు, వివిధ సంఘాల బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పొగాకును కొనుగోలు చేయాలి : పి.రామచంద్రయ్య

విశాలాంధ్ర-పత్తికొండ: రైతులు పండించిన పొగాకు పంటను తక్షణమే కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం పత్తికొండ పరిసర ప్రాంతాల్లో రైతులు పండించిన పొగాకును రైతు సంఘం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీపీఐ సంస్థ వారు పత్తికొండ ప్రాంతంలో గ్రామ గ్రామానికి వెళ్లి తమ సంస్థ పొగాకు పంటను సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుందని, క్వింటం రూ.15 వేల చొప్పున కొనుగోలు చేస్తామని రైతులకు మాయమాటలు చెప్పి పొగాకు సాగు చేయించారని, రైతులు సంస్థ చెప్పిన మాటలు విని పొగాకు సాగు చేశారని, పండిన పంటను కొనుగోలు చేయక గిట్టుబాటు ధర కల్పించక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవడం జరిగిందన్నారు. పొగాకు పంటకు ఎకరాకు లక్ష రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ నేడు ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టడం జరుగుతుందన్నారు. పొగాకు సాగు చేసిన రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.రాజా సాహెబ్, నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు కారన్న, మండల కార్యదర్శి సిద్ద లింగప్ప, నాయకులు నాగిరెడ్డి, రామాంజనేయులు, రంగప్ప, ఓబులేసు, నరసింహులు, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామక పత్రాలు అందజేత

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: కర్నూలు, నంద్యాల మెడికల్ కాలేజీలు, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కర్నూలు యందు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కింద 9 కేటగిరాలకు చెందిన పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ శుక్రవారం ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. 2023లో ఇచ్చిన నోటిఫికేషన్‌లో మెరిట్ రోస్టర్ ప్రకారం ఎంపికైన 9 కేటగిరీల చెందిన మొత్తం 31 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, కర్నూలు మెడికల్ కాలేజీ అసిస్టెంట్ డైరెక్టర్ అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల అడ్డాలలో మంచినీటి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : నగరంలో ఉన్న కార్మిక అడ్డాలలో మంచి నీటి చలివేంద్రాలు ఏర్పాటు చేసి తీవ్ర ఎండకు గురవుతున్న కార్మికుల దాహార్తిని తీర్చి వారిని వడదెబ్బకు గురి కాకుండా కాపాడాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ నగర కార్యదర్శి డి.నల్లన్న, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్పలు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ కర్నూలు వెంకటేశ్వర్లుకు పత్రం సమర్పించారు. మునెప్ప మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికుల అడ్డాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి కార్మికులు వడదెబ్బకు గురి కాకుండా కాపాడాలన్నారు. అసంఘటిత రంగంలో పని చేస్తున్న భవన నిర్మాణ, ఆటో, హమాలి, హోటల్స్ బేకరీ, ఒంటెద్దు బండి, రిక్షా కార్మికులు, కిరాణా దుకాణాల కార్మి కులు, బట్టల దుకాణాల కార్మికులు, చిన్న వ్యాపారస్తులు తదితర రంగాలలో పనిచేస్తున్న వారిని లేబర్ కమిషన్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిం చి, కార్మికులను గుర్తించి వీరందరికీ ఈ శ్రమ్ కార్డులు చేయించి కార్మికులను వారి కుటుంబాలను పరోక్షంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నగర కార్యదర్శి నల్లన్న మాట్లాడుతూ బీఓసీ సంక్షేమ బోర్డును పునర్దిందించి బోర్డు నుంచి రావలసిన 2019 సంవత్సరం నుండి పెండింగ్‌లో ఉన్న దాదాపు 47 వేల క్లైయిమ్‌లను ఉన్నత అధికారులతో చర్చించి తక్షణమే కార్మికుల తక్షణమే కార్మికుల ఖాతాలలో డబ్బులు జమ చేసి కార్మికులందరినీ ఆర్థికంగా ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి టి.రామాంజనేయులు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు యిర్మియా, కృష్ణ, మాణిక్యం మద్దిలేటి, గౌస్ పాల్గొన్నారు.

నూతన వక్ఫ్ చట్టం రద్దు చేయాలి

విశాలాంధ్ర - కర్నూలు : కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ కర్నూలు ఆటోనగర్లో శుక్రవారం ముస్లింలు భారీ నిరసన ప్రదర్శన, మానవహారం నిర్వహించారు. దేశ ముస్లింలలో అభద్రతా భావాన్ని గురిచేస్తున్న వక్ఫ్ చట్ట సవరణను కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కు తీసుకొని, రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపుమేరకు శుక్రవారం ప్రార్థనల అనంతరం కర్నూలు ఆటో నగర్‌లోని మస్జిద్ ఏ ఆయేషా దేశాయి నుండి సంతోష్ నగర్ జాతీయ రహదారి వరకు భారీగా మానవహారం నిర్వహించిన ముస్లిం సోదరులు కేంద్రప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేశారు. వక్ఫ్ బోర్డు ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు ధారా దత్తం చేసేందుకే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నూతన నల్ల చట్టాలను తీసుకువచ్చిందని విమర్శించారు.. కేంద్రం వెంటనే వక్ఫ్ చట్ట సవరణను రద్దు చేయకుంటే దేశవ్యాప్తంగా ముస్లింల ఆగ్రహానికి గురి కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు అబ్దుల్ సత్తార్, ఆటోనగర్ ప్రెసిడెంట్ ఎస్ఎన్ ఖాద్రి సాహెబ్, మౌలానా ఉమర్ నాజీమ్ తో పాటు కేకే మున్నా, ఖాదర్, అమీర్ మావియాతో పాటు ఆటోనగర్ కార్మికులు పాల్గొన్నారు.

ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తాం : సీపీఐ

విశాలాంధ్ర - ఆదోని: రాజ్యాంగ విరుద్ధ వక్ఫ్ సవరణ చట్టాన్ని అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు, పట్టణ కార్యదర్శి ఎస్ సుదర్శన్ అన్నారు. శుక్రవారం మాసా మసీద్ కాలనీయందు మతోన్మాద విధానాలను వ్యతిరేకిస్తూ, భారత రాజ్యాంగ పరిరక్షణకై సీపీఐ ఆధ్వర్యంలో ప్రచార ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వక్ఫ్ బిల్లు చట్టాన్ని వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు సూచించిన వరిగణలోకి తీసుకోకుండా వివాదాస్పదమైన చట్టాన్ని అర్థరాత్రి సమయంలో మోడీ ప్రభుత్వం ఆమోదింప చేసిందని విమర్శించారు. మైనార్టీలు ముఖ్యంగా ముస్లింలను లక్ష్యంగా చేసుకున్న బిజెపి మతం పేరిట విభజించేందుకు స్పష్టమైన ప్రయత్నం చేస్తుందని అన్నారు. వక్ఫ్ బిల్లుపై చర్చ సమయంలో మైనార్టీలకు సాధికారత కోసం వినియోగిస్తామని బీజేపీ నేతలు బూటకపు హామీలు ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు షేక్షావలి, సహాయ కార్యదర్శి విజయ్, ఇన్సాఫ్ కమిటీ నాయకులు షాషావలి ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: వంటగ్యాస్ ధరలు పెంచి దేశవ్యాప్తంగా ప్రజలపై రూ.9 వేల కోట్లు ప్రజలపై భారాలను మోపడాన్ని నిరసిస్తూ ఎమ్మిగనూరు పట్టణంలో శుక్రవారం రోజున సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో వినూత్నంగా నిరసన చేపట్టారు. సిలిండర్లకు పాడేగట్టి ఎంపీడీవో కార్యాలయం నుండి సోమప్ప సర్కిల్ వరకు రాస్తారోకో అనంతరం ధర్నా కార్యక్రమం చేపట్టారు. పట్టణ సీపీఐ కార్యదర్శి జి.రంగన్న, మంత్రాలయం సీపీఐ లినాయకులు భాస్కర్ యాదవ్, పట్టణ సహాయ కార్యదర్శి సమీవుల్లాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు వంట గ్యాస్ ధర తగ్గించడం ఎన్నికల ముగియగానే ధరల పెంచడం మోసపూరమని, గ్యాస్ సిలిండర్‌కు రూ.50 ధర పెంచి, దేశంలోని 32 కోట్ల వినియోగదారులపై రూ.9,100 కోట్లు భారం మోపటం చాలా దుర్మార్గమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల జీవన స్థితిగతులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన గ్యాస్ డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమైక్య పట్టణ కార్యదర్శి వీరమ్మ, చాముండి, బేగం, సీపీఐ నాయకులు కేసీ జబ్బర్, మాలిక్, తిమ్మ గురుడు, విజయేంద్ర, వీరేష్, కాజా, నరసింహులు, ఖాదర్, వెంకటేష్, శంకర్, నరసింహ గౌడ్, వీరేంద్ర, హనుమంతు, నాగరాజు, రాజు, అజారుద్దీన్, బాష, ఎల్లప్ప, శేఖర్ పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా శాంతియుత నిరసన

విశాలాంధ్ర - ఆదోని క్రైం : రాజ్యాంగ బద్ధంగా రాజ్యాంగానికి లోబడి వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా శాంతియుత నిరసన రాయలసీమ ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో దుల్షాపైల్వాన్ మసీదులో శుక్రవారం నమాజ్ అనంతరం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టినట్లు మసీద్ ముతవల్లి జిక్రియా తెలిపారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం నల్ల చట్టాలను తీసుకొస్తున్నదని దీనిని ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలన్నారు. దేశంలోని ముస్లింలను అణిచివేయడానికి వారి ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి వక్ఫ్ చట్టాన్ని మార్చి తమకు అనుకూలంగా చేసుకుని అన్యాయం చేస్తున్నారన్నారు. టీడీపీలో ఉన్న ముస్లిం మైనారిటీ నాయకులు భేషరతుగా ఆ పార్టీకి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ నాయకులు బయటకు వచ్చి ఆందోళన చేపట్టాలని కోరారు. స్థానికంగా ఉన్న టీడీపీ నాయకులు ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు.

రైతు సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ

విశాలాంధ్ర నందవరం: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టడం జరిగినది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్ మాట్లాడుతూ ఆల్ ఇండియా కిసాన్ సభ 1936 ఏప్రిల్ 11న ఆవిర్భవించింది ఆ రోజు నుంచి నేటి వరకు రైతుల పక్షాన పోరాటాలు చేస్తుందన్నారు. దున్నేవానికి భూమి హక్కు కావాలని మిగులు భూములను పంచిన ఘనత రైతు సంఘానిదే అన్నారు. భవిష్యత్తులో వ్యవసాయం కార్పొరేట్ శక్తులు చేతుల్లోకి వెళ్లి పోతుంది రాబోయే రోజుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఒత్తిడి తెచ్చే విధంగా రైతులను చైతన్య పరచి భవిష్యత్తు ఉద్యమాలు నిర్మిస్తామని వారు తెలిపారు. సీపీఐ మండల కార్యదర్శి గిడ్డయ్య, రైతు సంఘం తాలూకా కార్యదర్శి శాంతప్ప, ముని, రామలింగడు, నరసింహులు, తిమ్మప్ప, నరసప్ప, భీమన్న, నాగేంద్ర పాల్గొన్నారు.

సాక్షి ఎడిటర్‌పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : బాధిత కుటుంబం చెప్పిన ఆవేదనను అక్షర రూపంలో ప్రచురిస్తే సాక్షి ఎడిటర్ మరో ఆరుగురిపై కేసులు పెట్టడం కక్ష్య సాధింపులో భాగమేనని ఐజేయూ జాతీయ సమితి సభ్యులు కె.నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా గౌరవ అధ్యక్షులు ఎన్.వెంకట సుబ్బయ్య, గౌరవ సలహాదారులు, రాష్ట్ర సమితి సభ్యులు వైవీ కృష్ణా రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఈఎన్ రాజు, కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర సమితి సభ్యులు బి.మధుసూధన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.సుంకన్న, కోశాధికారి అంజి, జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి, జిల్లా సహాయ కార్యదర్శులు శివరాజ్ కుమార్, అవినాష్, జిల్లా కార్యవర్గ సభ్యులు మధు, చిరంజీవి ఆరోపించారు. సాక్షి ఎడిటర్ ఆర్ ధనుంజయరెడ్డి, మరో ఆరుగురిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గం, పశువేములకు చెందిన హరిచంద్ర అనే వ్యక్తి కిడ్నాప్‌కు గురై హత్యకు గురయ్యారు. ఇదే విషయాన్ని మృతిని భార్య, బంధువులు తన భర్తను టీడీపీకి చెందిన వారే హత్య చేశారని ఆరోపించారు. అదే విషయాన్ని ఆమె మీడియాతో మాట్లాడారు. ఆ విషయాన్ని సాక్షి ఆంధ్ర ప్రదేశ్ ఎడిషన్‌లో ప్రచురించడం జరిగిందని చెప్పారు. ఇది జీర్ణించుకోలేని టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేయడం, పోలీసులు వెంటనే సాక్షి ఎడిటర్ ఆర్ ధనుంజయరెడ్డి మరో ఆరు మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం దుర్మార్గం అన్నారు.

దివ్యాంగులమైన మాకు న్యాయం చేయండి

విశాలాంధ్ర - కోడుమూరు : తోటి దివ్యాంగుడే కదా అని పొదుపు గ్రూపులో సభ్యుడిగా చేర్చుకొని, నమ్మి మోసపోయామని, తమకు న్యాయం చేయండి అంటూ బండగట్టు గ్రామ దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేశారు. కోడుమూరు మండల సీపీఐ కార్యదర్శి రాజుతో కలిసి కోడుమూరు సీఐ ఎండీ తబ్రేజ్,ఎ స్ఐ ఏపీ శ్రీనివాసులులకు ఫిర్యాదు చేశారు. బండగట్టు గ్రామానికి చెందిన బంకు కురువ చంద్ర అనే వ్యక్తి అప్పటి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్‌లతో కుమ్మక్కై పొదుపు గ్రూపు రుణానికి సంబంధించిన డబ్బులన్నీ కాజేసి మమ్మల్ని మోసగించాడని సీఐ వద్ద దివ్యాంగులు వాపోయారు. దేవనకొండ మండలంలోని బండగట్టు గ్రామానికి చెందిన ఎస్‌టీ వీరేష్, సి.రాఘవేంద్ర, కె.శ్రీనివాసులు, కె.లక్ష్మి అనే దివ్యాంగులు శుక్రవారం కోడుమూరు చేరుకుని పట్టణంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ, ఎస్ఐలను కలిసి గ్రూప్ మొదటి లీడర్ బంకు కురువ చంద్ర, బ్యాంకు మేనేజర్ నరహరి మల్లికార్జున, ఫీల్డ్ ఆఫీసర్ చాంద్ భాషలపై గాంధీ దివ్యాంగుల పొదుపు లక్ష్మి గ్రూపు లోన్ సంబంధించిన డబ్బులు మొత్తం కాజేసి, మమ్మల్ని మోసగించారని ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ప్రతి నెల రూ.15,500లు ప్రకారం నలుగురు సభ్యులు 22 నెలల కంతులు మొత్తం రూ.3.41 లక్షలు డబ్బులు అన్ని బ్యాంకులో కట్టకుండా కాజేసినట్లు బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు. ఈ సమస్యపై గత కొన్నేళ్లుగా దేవనకొండ పోలీస్ స్టేషన్ సీఐ, జిల్లా ఎస్పీల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని పలుమార్లు తిరగడం జరిగిందన్నారు. ఎక్కడ తమకు న్యాయం జరగలేదని, కోడుమూరు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో జరిగిన మోసానికి ఇక్కడే కోడుమూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తున్నామని, ఇక్కడైనా న్యాయం జరుగుతుందనే ఆశతో వచ్చినట్లు తెలిపారు. స్పందించిన సీఐ బాధితుల ఫిర్యాదు మేరకు బ్యాంకు మేనేజర్, బంకు చంద్ర, ఫీల్డ్ ఆఫీసర్‌లపై కేసు నమోదు చేసి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

విద్యార్థులు డబ్బులు ఇస్తేనే పాస్ చేస్తారా

విశాలాంధ్ర - ఆదోని క్రైం: ఆదోని గర్ల్స్ కళాశాలలో ఓపెన్ ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఎగ్జామ్ జరుగుతుండగా కళాశాల ఉపాధ్యాయులు విద్యార్థుల దగ్గర నుండి వంద రూపాయలు ఇస్తేనే ప్రాక్టికల్స్ పాస్ చేయిస్తాం, లేకపోతే లేదు అనే విధంగా విద్యార్థుల దగ్గర నుండి వేల రూపాయలు వసూలు చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ పట్టణ కోశాధికారి శేఖర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండలు ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు డబ్బులు తేలేదని చెప్పినా వినిపించుకోకుండా కచ్చితంగా డబ్బులు ఇస్తేనే ఎగ్జామ్స్ రాయిస్తాం, ఒకవేళ లేకపోతే మీ పేరెంట్స్ ద్వారా ఫోన్‌పే ద్వారా చేయమని చెప్పడం బాధాకరమైన విషయమన్నారు. ఈ విషయంపై ప్రశ్నించగా విద్యార్థులు దగ్గర నుండి వసూలు చేసిన డబ్బులు కళాశాల మెయింటెన్స్, వర్కర్స్ కోసం మధ్యాహ్నం భోజనాల కోసం వసూలు చేశామని చెప్పడం సమంజసం కాదని వారు మండిపడ్డారు. తక్షణమే ఈ సంఘటనపై స్థానిక విద్యాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వినయ్, పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, డివిజన్ నాయకులు రసూల్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఘనంగా పూలే జయంతి వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో కర్నూలు ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ శుక్రవారం మహాత్మ జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణ మోహన్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబా పూలే సంఘసంస్కర్త, కుల వ్యతిరేక కార్యకర్త, ఆలోచనాపరుడు, విద్య, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనకు కృషి చేశారన్నారు. ఆర్ఐలు నారాయణ, సోమశేఖర్ నాయక్, ఆర్ ఎస్సైలు, ఏఆర్ పాల్గొన్నారు.

అసిస్టెంట్ డైరెక్టర్ సస్పెండ్

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న వి.శ్రీనివాసులు శుక్రవారం సస్పెండ్ చేసినట్లు డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. గత కొన్ని రోజుల కిందట జరిగిన కార్యాలయంలో పని చేస్తున్న మహిళ ఉద్యోగులను వేధించినందుకు అసిస్టెంట్ డైరెక్టర్ వి.శ్రీనివాసులు సస్పెండ్ చేసినట్లు వారు తెలిపారు. ఆర్‌జేడీకే సామెల్ పాల్ విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా వేసిన కమిటీలో రుజువు కావడంతో ఇలాంటి సంఘటనలు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంఘటనలు జరగకుండా ప్రత్యేకమైన చర్యలు చేపడతామని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల కేంద్రంలో వెలసిన శ్రీశ్రీ మడివేలి మాచదేవ నూతన ఆలయ నిర్మాణానికి గ్రామ దేవతలు శ్రీశ్రీ పెద్ద లక్ష్మమ్మ దేవి, చిన్న లక్ష్మమ్మ దేవి ఆలయ పూజారి దంపతులు లలితమ్మ, నరసింహాచారి రజకులకు తమ వంతుగా శుక్రవారం విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నరసింహాచారి మాట్లాడుతూ శ్రీశ్రీ మడివేలి మాచదేవ నూతన ఆలయ నిర్మాణానికి ప్రజలు, భక్తులు తమవంతు సహాయ సహకారాలు అందించాలని, ఆలయ నిర్మాణంలో పాత్రులు కావాలని కోరారు. రజక సంఘం నాయకులు వెంకటేశ్, వడివేలు, అంజి పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటానన్న జగన్

విశాలాంధ్ర - తుగ్గలి: పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి భరోసా ఇచ్చినట్లు వైసీపీ వాలంటీర్ల విభాగం జిల్లా అధ్యక్షులు ఎంపీపీ గౌరవ సలహాదారులు శభాష్ పురం హనుమంతు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మతో కలిసి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని విజయవాడలో గురువారం కలవడం జరిగిందన్నారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటానని వైఎస్ జగన్మోహన్ తమకు భరోసా ఇచ్చినట్లు తెలిపారు.

ఫారం ఫాండ్‌లను ఉపయోగించుకోవాలి

విశాలాంధ్ర - ఓర్వకల్లు: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఒక్క రైతు తన పొలంలో ఫారం పాండు తవ్వించుకోవాల్సిందిగా ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం సోమయాజులపల్లె గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించారు ఫారం పాండు తవ్వించుకోవడం వలన తన భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ఫారం పాండ్‌లో ఉన్న నీటిని పంటలకు మందుల పిచికారికి వాడుకోవచ్చని, భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు.

నిరంతరం పోరాడే ఏఐకేఎస్‌ను బలపరచండి

విశాలాంధ్ర - ఓర్వకల్లు: శుక్రవారం ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని నన్నూరు గ్రామంలో ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి ఎస్.మధుసూధన్ జండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా బి.నాగన్న ఎస్.మధుసూదన్ మాట్లాడుతూ స్వాతంత్రం రాకముందు 1936 వ సంవత్సరం రైతుల పట్ల బ్రిటిష్ ప్రభుత్వం వలస పాలకులు రైతులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్న సందర్భంగా రైతులకు అండగా ఏఐకేఎస్ ఆవిర్భవించిందన్నారు. ఈ కార్యక్రమంలో నన్నూరు గ్రామ రైతులు పాల్గొన్నారు.

వీరభద్ర గౌడహాయంలో దేవరగట్టు అభివృద్ధి

విశాలాంధ్ర -హొళగుంద: మండలంలోని నేరనికి దేవరగట్టులో శుక్రవారం రూ.10 లక్షల సీసీ రోడ్డు నిర్మాణానికి టీడీపీ నాయకులు పూజ చేశారు. పూజారి గిరి మల్లయ్య స్వామి భూమి పూజ చేసి దేవరగట్టు అభివృద్ధి చెందాలంటే ఆశీర్వదించారు. మాజీ సర్పంచ్ తిమ్మయ్య, టీడీపీ నాయకులు నర్సా నాయక్, మల్లన్న గౌడ, దాఖ్యా నాయక్, బోయ మల్లికార్జున, రాజశేఖర్ గౌడ్, సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గం ఇన్చార్జి వీరభద్ర గౌడ, టీడీపీ యువ నాయకుడు హయంలో గిరి మల్లేష్ గౌడహయంలో దేవగట్టు అభివృద్ధి చెందుతుందన్నారు.

కబడ్డీ పోటీలను ప్రారంభించిన ఎంపీటీసీ

విశాలాంధ్ర-గూడూరు: పెంచికలపాడు గ్రామంలో కబడ్డీ పోటీలను ఎంపీటీసీ పోతురాజు మద్దిలేటి అట్టహాసంగా ప్రారంభించారు. కె.నాగలాపురం సుంకులాపరమేశ్వరి జాతర సంద ర్భంగా శుక్రవారం పెంచికలపాడు గ్రామస్తులు, జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు 16 జట్లు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. కబడ్డీ బహుమతి దాతలు ఉప్పర అయ్యప్ప, హనుమంతు, శేఖర్, లోకేష్, జయన్న, రంగడు, పెంచికలపాడు క్రీడల నిర్వహణ కమిటీ సభ్యులు దయ, శేఖర్, సురేష్ రెడ్డి, బజాజ్ ఫైనాన్స్ మేనేజర్ కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు నైపుణ్యాలను పెంచుకోవాలి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: చదువుతో పాటు యువత నైపుణ్యాలను పెంచుకోవాలని, అప్పుడే ఈ పోటీ ప్రపంచంలో మంచి ఉద్యోగ అవకాశాలు అందుకోగలుగుతారని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. శుక్రవారం జిల్లా యువజన సంక్షేమ శాఖ సెట్కూరు ఆధ్వర్యంలో 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ హైదరాబాద్ వారి సహకారంతో నగర శివారులోని కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన పోటీ పరీక్షలు, ఉపాధి అవకాశాలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా నిష్ణాతులైన శిక్షకుల చేత కర్నూలు జిల్లాలోని అన్ని డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న జిల్లా యువజన సంక్షేమ శాఖ సెట్కూరు, 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ వారిని అభినందించారు.

వలసల నివారణ కోసమే ఉపాధి పనులు

విశాలాంధ్ర తుగ్గలి: మండలంలోని అన్ని గ్రామాలలో వ్యవసాయ కూలీలు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లకుండా ఉండేందుకే ఉపాధి హామీ పనులను నిర్వహిస్తున్నట్లు అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్ డి. హేమ సుందర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతము గ్రామాలలో వ్యవసాయ కూలీలకు పనులు లేవని అందువల్ల ప్రజలు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లకుండా స్థానికంగా ఉండే గ్రామాలలోనే ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించడం జరుగుతుందన్నారు.అంతేకాక వ్యవసాయ బోరు బావులు ఉన్న రైతులు తమ పొలాల్లో పండ్ల తోటలు సాగు చేసుకునేందుకు ముందుకు వస్తే అలాంటి రైతులందరికీ సాగు చేసుకునేందుకు అవసరమైన 100 శాతం పెట్టుబడి ప్రభుత్వమే కల్పిస్తుందన్నారు. వ్యవసాయ భూములు క్రమక్షయం చెందకుండా ఉండేందుకు వారి పొలాల్లో ఫారం పంద త్రవేందుకు ప్రభుత్వమే ఖర్చు పెడుతుందన్నారు. కూలీలు, రైతులు ఉపాధి హామీ పథకమును సద్వినిగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన కోరారు.

మరిన్ని వార్తలు E-PAPERలో..

నటనకు జీవం పోసిన ఉత్తమ నటుడు ఎస్ఆర్ఎస్ ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నటనకు జీవం పోసిన ఉత్తమ నటుడు ఎస్ఆర్ఎస్ ప్రసాద్ అని పలువురు వక్తలు కొనియాడారు. కళారాధన ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. రాయలసీమ రంగస్థల రత్నం కళాహంస అవార్డు గ్రహీతకు బాల అకాడమీ అధినేత ఎంజీవీ రవీంద్రనాథ్ నిర్వహణలో ఘన సన్మానం జరిగింది. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఉగాది పండుగ రోజున ఏపీ కళా సాహిత్య రంగాల్లో విశేష కృషి చేసిన కళాకారులకు అత్యంత ప్రతిష్టాత్మకమైన కళా రత్న, హంస అవార్డును కళారాధన కార్య నిర్వాహక కార్యదర్శి సుంకర రాజశేఖర్ ప్రసాద్‌ను కళారత్న హంస అవార్డుతో పాటు రూ.50 వేల నగదు పురస్కారంతో పర్యాటక, సినిమాటోగ్రఫీ, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సమక్షంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సత్కరించారు. శుక్రవారం కళా రంగంలో విశేష కృషిచేసిన రాయలసీమ కళారత్నం ఎస్ఆర్ఎస్ ప్రసాద్‌ను స్థానిక మధుమణి నర్సింగ్ హోమ్ కాన్ఫరెన్స్ హాల్లో ఘనంగా సన్మానించారు. ఈ సభలో ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర నాయకులు ఎన్ఎండి ఫయాజ్, వర్ధంశెట్టి రాజారాం, ఎంసి కొండయ్య, డాక్టర్ సి.మధుసూదన్ రావు, కందుకూరి శ్రీరామమూర్తి, డాక్టర్ జి.రవికృష్ణ, భవనాసి నాగ మహేష్, నాగిరెడ్డి కేశవరెడ్డి, షావలి రెడ్డి, రాజశేఖర్ తదితర ప్రముఖులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఓటీపీ చెప్పం..

మాకు సర్వేలు అవసరం లేదు

విశాలాంధ్ర - తుగ్గలి: గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు, ఆశాలు ఎన్‌సీడీ సర్వే చేయలేక తీవ్ర ఒత్తిడికి గురవుతున్నట్లు తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఎన్‌సీడీసర్వే చేయాలని 2024, నవంబర్ నెలలో ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఏఎన్ఎంలు ఆశాలు ఇంటింటికి వెళ్లి 18 ఏళ్లు దాటిన వారందరికీ వారికి ఉన్న వ్యాధులపై ఎన్‌సీడీ సర్వేలో నమోదు చేయాలి. అయితే ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో ప్రజల సెల్‌కు ఓటీపీ వెళుతుంది. ఓటీపీ నెంబర్ చెబితేనే సర్వే చేయడానికి వీలవుతుంది. ఇంటిలో ఎంతమంది ఉన్నా వారందరినీ సర్వేలో నమోదు చేయాలంటే ఒక్కొక్కరికి ఒక్కొక్క ఓటీపీ వెళుతుంది. ఆ సమయంలో కొంతమంది ఓటీపీ చెప్పం, మాకు సర్వే అవసరం లేదంటూ ఎదురు ప్రశ్నలతో ఏఎన్ఎం, ఆశాలను ఇబ్బందులు గురిచేస్తున్నారు. ప్రభుత్వం ఓ పక్క ఓటీపీలు ఎవరికి చెప్పొద్దంటూ ప్రచారం చేయడం వల్ల గ్రామాలలో సర్వేకు వెళుతున్న ఏఎన్ఎంలకు ప్రజలు ఓటీపీ చెప్పకపోవడంతో ఎన్‌సీడీ సర్వే మందుకొడిగా జరుగుతోంది. సర్వే కోసం ఇంటి వద్దకు వెళ్ళినప్పుడు కొందరు ఇంటిలో ఉంటారు. మరికొందరు వివిధ ప్రాంతాల్లో ఉంటారు. వివిధ ప్రాంతాల్లో ఉన్నవారు ఓటీపీ అడిగితే చెప్పమని ఫోన్లు కట్ చేయడం జరుగుతుందని ఆవేదన చెందుతున్నారు. ఇలా సర్వేలో అనేక ఇబ్బందులకు ఏఎన్ఎంలు, ఆశాలు గురవుతున్న ఉన్నతాధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం వరుసగా ప్రభుత్వ ఉద్యోగుల అందరికీ సెలవులు రావడంతో మాత్రం ఏఎన్ఎం, ఆశాలకు సెలవు లేవు, ప్రతిరోజు 30 నుండి 50 వరకు ఎన్‌సీడీ సర్వే చేయాలని, లేకపోతే చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టమైన ఆదేశాలు ఉన్నతాధికారుల నుండి శుక్రవారం వెళ్లబడ్డాయి. దీంతో ఏఎన్ఎంలు, ఆశాలు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి ఎన్‌సీడీ సర్వేకు వచ్చిన ఏఎన్ఎం, ఆశాలకు ఓటీపీ చెప్పాలని బహిరంగ ప్రకటన ఇస్తే కొద్ది వరకు సర్వే వేగవంతంగా జరిగేందుకు వీలవుతుందని ఉన్నతాధికా రులను కోరుతున్నారు. తాము ప్రజలకు సేవ చేసేందుకు ఉన్నామని, అయితే ఓటీపీలు పెట్టడం వల్ల సర్వేలో పలు రకాల ఇబ్బందులకు గురవుతున్నామని ఏఎన్ఎంలు ఆవేదన చెందుతున్నారు. ఓటీపీలు లేకుండా ఎంతటి సర్వే అయినా మేము చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఏఎన్ఎంలు, ఆశాలు తెలుపుతున్నారు. అందువల్ల వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు ఓటీపీ లేకుండా సర్వే చేసినందుకు అవకాశం కల్పించాలని కోరుతున్నాను.

పీజీ కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న వారు, డిగ్రీ పాస్ అయిన విద్యార్థులు కర్నూలులోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్శిటీలో 2025-26 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల్లో ప్రవేశం కోసం ఏపీ పీజీ సెట్-2025 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఇంచార్జీ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ పీఎస్ షా వలి ఖాన్ అన్నారు. శుక్రవారం స్థానిక డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్శిటీలోని సమావేశ మందిరంలో యూనివర్సిటీ అడ్మిషన్స్ కమిటీ సమావేశం ఇంచార్జి వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ పీఎస్ షా వలి ఖాన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఇంచార్జీ వైస్ ఛాన్సెలర్ మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వారు నిర్వహించే ఆంధ్రప్రదేశ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ - 2025 ద్వారా వివిధ పీజీ కోర్సుల్లో ప్రవేశం కొరకు విద్యార్థులు మే 5 తేదీలోగా ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ద్వారా యూనివర్శిటీలో ఎం.ఎ. విభాగంలో ఇంగ్లీష్, ఎకనామిక్స్, ఉర్దూ, ఎం.ఎస్.సి విభాగంలో కంప్యూటర్ సైన్స్, బాటని, జువాలాజి, ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ, ఎం.కామ్ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చన్నారు. విద్యార్థులు https://cets.apsche.ap.gov.in/PGCET/PGCET/PGCET_HomePage.asp వెబ్ సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

13న అభయాంజనేయ స్వామి రథోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - తుగ్గలి: మండల పరిధిలోని అమినాబాద్ గ్రామంలో ఈ నెల 13న అభయాంజనేయ స్వామి రథోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం నుండి పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, సాయంత్రం 5 గంటలకు రథోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆలయ నిర్వాహకులు రథోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను చేయడంలో నిమగ్నమయ్యారు. సర్పంచ్ గౌరవ సలహాదారుడు భైరపు మధుబాబు చౌదరి, సర్పంచ్ భైరపు విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి గోపాల్‌లు గ్రామంలో తాగునీటి సమస్య పారిశుద్ధ సమస్య, వీధిలైట్ల సమస్య తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఘనంగా జరిగిన పోతలింగ స్వామి ఉచ్చాయా

విశాలాంధ్ర - హొళగుంద: మండలంలోని గజ్జహళ్లిలో శుక్రవారం సాయంత్రం 7 గంటలకు పోతలింగేశ్వర స్వామి రథోత్సవం సందర్భంగా ఉచ్చాయా ఘనంగా జరిగింది. స్వామివారికి గ్రామ పెద్దలు మాజీ జెడ్పీటీసీ సభ్యులు గజ్జహళ్లి తిమ్మారెడ్డి, గజ్జహళ్లి హనుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉచ్చాయా అశేష భక్తుల నడుమ వైభవంగా లాగారు. స్వామివారి పల్లకి సేవను నిర్వహించారు. పూజారి రామలింగ భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు భక్తులతో స్వామివారి ఆలయం కిటకిటలాడింది.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష 21కి వాయిదా

విశాలాంధ్ర - శిరివెళ్ల : ఏపీ మోడల్ స్కూల్లో 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఈ నెల 20న జరగాల్సిన 21వ తేదికి వాయిదా వేసినట్లు ఏపీ మోడల్ స్కూల్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇష్రాత్ బేగం పేర్కొన్నారు. 20 ఆదివారం ఈస్టర్ పండుగ కావడం వల్ల 21 సోమవారం ఉదయం 9నుండి 12గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు. మోడల్ స్కూల్ ప్రవేశాలకై దరఖాస్తు చేసుకున్న విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు గమనించి ఏప్రిల్ 21వ తేదీ సోమవారం ఉదయం జరిగే పరీక్షకు హాజరు కావాలని స్పష్టం చేశారు. 16వ తేదీ నుండి ఉదయం హాల్ టికెట్లు ఇస్తూ ప్రవేశ పరీక్షకు సంబంధించి అవగాహన కల్పిస్తామన్నారు.

వెంకట సుబ్బారెడ్డి మృతి బాధాకరం

విశాలాంధ్ర - బనగానపల్లె : పట్టణంలోని ఖర్ద మొహిదీన్ కాలనీకి చెందిన వెంకట సుబ్బారెడ్డి (71) (సొసైటి బ్యాంక్ రిటర్డ్ మేనేజర్) అనారోగ్యంతో మరణించాడు. శుక్రవారం విషయం తెలుసుకున్న బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి వెంకట సుబ్బారెడ్డి మృత దేహానికి పూలమాలతో నివాళ్లులు అర్పించి వారి కుటుంభానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

విశాలాంధ్ర - చాగలమర్రి : స్థానిక మెయిన్ బజార్‌లోని టీడీపీ కార్యాలయంలో బూత్ ఇన్చార్జిలకు టీడీపీ సభ్యత్వ నమోదు కార్డులను టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్అన్సర్ భాష శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి ఐడీ కార్డులను అందజేస్తున్నామన్నారు. చాగలమరి పట్టణంలో 19 బూతు ఇన్చార్జిలకు కార్డులను అందజేశామన్నారు. వారు సభ్యత్వం తీసుకున్న వారి ఇంటింటికి వెళ్లి అందజేస్తారన్నారు. సభ్యత నమోదు వల్ల భీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ ముల్లా అజీమ్, టీడీపీ నాయకులు జెట్టి నాగరాజు, హనీఫ్, కొలిమి సోను, నూర్ బాష, బషీర్, మురళి, ముల్లా గఫార్, బుగ్గ గఫార్, ఇంతియాజ్ రాజేష్, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికల రక్షణకు కఠినమైన చట్టాలు

విశాలాంధ్ర - వెలుగోడు: బాలికల రక్షణ కొరకు ప్రత్యేక భద్రత చట్టాలను తీసుకువచ్చారని ఆత్మకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ సురేష్ కుమార్ రెడ్డి తెలిపారు. వెలుగోడు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలికలకు వివిధ చట్టాల గురించి అవగాహన కల్పించారు. బాలికల పట్ల లైంగిక దాడులు, అత్యాచారం తదితర నేరాలకు పాల్పడిన పోక్సో చట్టం పటిష్టంగా అమలు జరుగుతుందని, బాలిక సంరక్షణకు గతంలో దిశా చట్టం మాదిరిగానే ప్రత్యేక యాప్ ను ప్రభుత్వము ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. బాల్య వివాహాలు చేసుకోవడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలను నిరోధించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పాఠశాల హెడ్మాస్టర్ సత్యనారాయణ హెగ్డే, ఎస్ఐ షాషావలి పోలీస్ సిబ్బంది చిన్న శివయ్య పాల్గొన్నారు.

పూలే దంపతులకు భారతరత్న ప్రకటించాలి

విశాలాంధ్ర - బనగానపల్లె :బడుగు బలహీన వర్గాల స్ఫూర్తి ప్రదాత మహాత్మా జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలు నియోజకవర్గ కేంద్రం బనగానపల్లి ఎంఆర్పిఎస్ కార్యాలయంలో నియోజకవర్గ ఎంఎస్‌పి ఇన్చార్జి మూలింటి పెద్ద మునయ్య మాదిగ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి కేక్ కట్ చేసి ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా సీనియర్ నాయకులు కోవెలకుంట్ల మండల ఇన్చార్జి ఇరకమాను, నాగేశ్వరరావు మాదిగ ,ఎర్రన్న మాదిగ. కటికవానికుంట్ల బాలరాజు యాదవ్, కార్పెంటర్ బాష, మిద్దె రామకృష్ణ మాదిగ, వెంకటరాముడు, డి.సుబ్బయ్య మాదిగ, నరసింహుడు, గీత భాస్కర్, జెట్టి మద్దిలేటి, గార వెంకటేశ్వర్లు, చిన్న చేప మద్దిలేటి పాల్గొన్నారు.

విశాలాంధ్ర - చాగలమర్రి : మండల వ్యాప్తంగా ప్రముఖ సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వీరభద్రుడు, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్‌లు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్సులు,మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : పట్టణ పరిధిలోని స్థానిక ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉప విద్యాశాఖ అధికారి ఎస్.వెంకటరామిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.రాజయ్య మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో నాగేశుడు, శ్రీనివాస రెడ్డి, శ్రీనివాసులు, శంకర్ రెడ్డి, వెంకట రమేష్,తిరుపతి రెడ్డి, సురేష్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, వెంకటేశ్వర్లు, సుగుణ, జాహిరాభి, సునీల్, సుధాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : మహాత్మా జ్యోతి రావు పూలే 198వ జయంతి సందర్భంగా పట్టణంలోని సంగమేశ్వర సర్కిల్ నందు మహాత్మా జ్యోతిభా పూలే జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాల వేసి జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు నాగన్న, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు యాదవ్, అధ్యక్షులు డబ్బి వెంకటస్వామి గౌడ్, గౌరవ అధ్యక్షులు రామకృష్ణ, నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మాజీ ఆత్మకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ మన్నెం బాలస్వామి యాదవ్ మాట్లాడుతూ అణగారిన ప్రజల అభ్యున్నతికి, బాలికల విద్యాభివృద్ధికి, సమాజంలో ఉన్న రుగ్మతలను పోగొట్టడానికి విశేష కృషి చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే దంపతులకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు శ్రీహరి, ఉపాధ్యక్షులు వీరన్న, ఫారెస్టర్ వెంకటరమణ, లాయర్ బొల్లు నగేష్, డీలర్ రమణ, హెల్త్ డిపార్ట్మెంట్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్దారణ కు కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని అపుస్మా ఆళ్లగడ్డ అధ్యక్షులు అమీర్ భాష అన్నారు. శుక్రవారం పట్టణ శివారులో ఉన్న ఇండియన్ గ్లోబల్ హైస్కూల్లో ప్రిన్సిపాల్ దస్తగిరి భాషా ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అమీర్ భాష విద్యార్థులతో కలిసి జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలస్వామి రెడ్డి, శివ సుమాంజలి, మార్త కుమారి, జ్యోతి, సుగుణ, లక్ష్మి, హేమలత, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ డా గంగన్న ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతి రావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంగన్న మాట్లాడుతూ సమాజంలో అనగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయులు, విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా.రాజు, నాగ మస్తాన్, విజయ లక్ష్మి, డా.వెంకట సుబ్బయ్య, డా.జయచంద్ర, వెంకటేష్ కుమార్, కల్లు ఉసేనయ్య, కాశీ విశ్వనాథ్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

నవ వధువులకు పెళ్లి కానుక పంపిణీ : బీసీ రాజారెడ్డి

విశాలాంధ్ర - బనగానపల్లె : నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన నవ వధువుల కోసం ఉచితంగా పెళ్లి కానుక పంపిణీ చేస్తున్నట్లు బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి తెలిపారు. శుక్రవారం బనగానపల్లె పట్టణానికి చెందిన షేక్ కరిముల్లా కుమార్తెకు, కీర్తిశేషులు రజక వెంకటేశ్వర్లు, సుబ్బమ్మ దంపతుల కుమార్తె, బనగానపల్లె మండలం తమ్మడపల్లె గ్రామానికి చెందిన రజక వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవి దంపతుల కుమార్తెకు పెళ్లి కానుకలు అందజేశారు. ఈసందర్భంగా బిసి రాజారెడ్డి మాట్లాడుతూ తన తల్లిదండ్రులు కీ.శే.బీసీ గుర్రెడ్డి, బిసి లక్కమ్మ దంపతుల జ్ఞాపకార్థం 2022 నుంచి ఈ పెళ్లి కానుక పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. నాలుగేళ్ల కాలంలో నేటి వరకు 1350 మందికి పెళ్లి కానుక అందజేశామని తెలిపారు. పెళ్లి కానుకలో రూ.3 వేలు విలువ చేసే పెండ్లి కుమార్తెకు చీర, పెళ్లి కుమారుడికి ప్రముఖ షియారామ్ కంపెనీ సర్ట్, పాయింటు ఉంటాయన్నారు. కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు ఈ పెళ్లి కానుక అందజేస్తున్నట్లు వధువు తరఫున పెళ్లి కార్డు తీసుకొని వచ్చి తనను సంప్రదిస్తే వారికి పెళ్ళికానుకను అందజేస్తామన్నారు.

కుల వ్యవస్థపై మొదట పోరాటం చేసిన వ్యక్తి మహాత్మ పూలే

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: మహాత్మ జ్యోతిరావు పూలే కుల వ్యవస్థపై మొదట పోరాటం చేసిన వ్యక్తి అని, ఆయన లేకపోతే అణగారిన వర్గాల వారు ఇప్పటికీ విద్య, వైద్యానికి దూరంగా ఉండేవారని క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎల్లా కృష్ణ, డాక్టర్ అనూష, డాక్టర్ విమల, డాక్టర్ సవిత దేవి, జానకి రామయ్య విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర -హొళగుంద: ఎల్లార్తిలో శుక్రవారం సర్పంచ్ కురువ చామండిశ్వరి ఆధ్వర్యంలో ఎంపీ యూపీ కన్నడ పాఠశాలలో మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా మహాత్మా జ్యోతి రావు పూలే చిత్ర పటానికి వైసీపీ జిల్లా ఉపాధ్యాక్షుడు ఎస్కే గిరి పూలా మాల వేసి నివాళి అర్పించారు. ఉపాధ్యాయులు సుచరిత, శరణప్ప ఫల్గొన్నారు.

విశాలాంధ్ర-గూడూరు: మహాత్మ జ్యోతిరావు పూలే జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని కర్నూలు పార్లమెంటు తెలుగు యువత కార్యదర్శి ఎం.చరణ్ కుమార్ అన్నారు. జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు పురస్కరించుకొని శుక్రవారం గూడూరు నగర పంచాయతీలో టిడిపి నేతలు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చరణ్ కుమార్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు మద్దతుగా జ్యోతిరావు పూలే ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు బీసీ సెల్ అధ్యక్షులు చెట్టుకింద సురేష్, మాజీ వాల్మీకి సంఘం ఉపాధ్యక్షుడు సంఘాల మధు, చెట్టు కింద నారాయణ, టి నాగరాజు, సోమన్న, సురేష్, బోయ శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర -హొళగుంద: విద్యార్థులు మహాత్మ జ్యోతిరావు పూలే బాటలు అందరూ నడవాలని సిద్ధార్థ పాఠశాల హెడ్మాస్టర్ చిదానంద కోరారు. పూలే సమాజంలో ఆదర్శ ప్రాయుడిగా, ఉపాధ్యా యుడిగ విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఉపాధ్యాయులు మూర్తి, పవన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక బి.క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో మహాత్మ జ్యోతిరామ్ పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగ స్వామి నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిధులు ప్రాంతీయ తనకి అధికారి గురవయ్య శెట్టి, గ్రామీణ సేవ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ కుమార్, నైస్ కంప్యూటర్ అధినేత రాయపాటి సాంబశివరావు, బీసీ వెల్ఫేర్ వార్డెన్ మరియు కళాశాల లెక్చరర్స్ మహాత్మ జ్యోతిరామ్ పూలే చిత్ర పటానికి పూల మాల వేసి ఘనమైన నివాళులర్పించారు. కళాశాల సీనియర్ లెక్చరర్స్ ప్రసన్నకుమార్, విజయశేఖర్, రామకృష్ణ, మల్లికార్జున, కృష్ణ మోహన్, ఉల్లోజి రావు, పార్థసారథి పటేల్, చిన్న మల్లేశ్వరుడు, శ్రీధర్, శ్రావణి, నాన్ టీచింగ్ సిబ్బంది సత్యానందం, భాస్కర్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ఓర్వకల్లు: మహాత్మా జ్యోతి రావు పూలే జయంతిని పురస్కరించుకొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి, వేడుకలు నిర్వహించారు. జ్యోతి రావు పూలే జయంతి అంటరానితనం, కుల వివక్ష నిర్మూలనపై అలుపెరగని పోరాటం చేశారన్నారు. ఎంపీడీఓ శ్రీనివాసులు ఈఓఆర్డీ పీవీ సుబ్బారాయుడు, ఇంజనీర్ ఎం.శ్రీనివాసులు, కార్యా లయం సిబ్బంది, ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : అంటరానితనానికి, కుల వివక్షకు, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా సమ సమాజ నిర్మాణం కోసం ఉద్యమించిన బహుజన తత్వవేత్త, సామాజిక దార్శనికుడు జ్యోతిరావు పూలే అని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ అన్నారు. శుక్రవారం నగరపాలక కార్యాలయంలో బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా శ్రీ జ్యోతిబాయి పూలే జయంతి సందర్భంగా, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మేనేజర్ ఎన్.చిన్న రాముడు, టీపీఆర్ఓ వెంకటలక్ష్మి, సూపరింటెండెంట్లు సుబ్బన్న, రామక్రిష్ణ, స్వర్ణలత, సూరరంగ బాబు, డీఎస్ఓ కృష్ణ మేనేజర్, టిడ్కో అధికారి పెంచలయ్య, సిబ్బంది రాజు, రామంజీ, మోహన్, నాగరాజు, షబాన, శ్రీనివాసులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - సి.బెళగల్: మండల కేంద్రంలోని మండల అభివృద్ధి కార్యాలయంలో మండల అభివృద్ధి కార్యాలయ సిబ్బంది మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకను పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేశారు. ఎంపీపీ బొంతల మునెప్ప మండల అభివృద్ధి అధికారి రాణెమ్మ, ఈఓఆర్డీ ఈశ్వరయ్య స్వామి, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఏపీవో రామన్న, ఈసీ రంగస్వామి, మంజుల, ఉపాధి హామీ సిబ్బంది టీఏలు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: ఎమ్మిగనూరు పట్టణ కేంద్రంలోని సంజీవయ్య నగర్ ప్రాథమిక స్కూల్ ఆవరణం నందు మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసన్న ఆధ్వర్యంలో ఘనంగా జ్యోతిరావు పూలే 198వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బీసీ ఐక్యవేదిక సంఘం నాయకులు రామచంద్ర, బీసీ బతకన్నా, బీసీ నరసింహులు, ఐఎఫ్‌టీయూ నాయకులు అనీఫ్, ఏసేపు, జయన్న, ప్రాథమిక స్కూల్ హెచ్ఎం వీరన్న పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: కంకర వొకేషనల్ జూనియర్ కళాశాలలో జ్యోతిరావు పూలే ఘనంగా నిర్వహించినట్లు కంకర వొకేషనల్ కళాశాల కరస్పాండెంట్ వేణుగోపాల్ శుక్రవారం చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు.

విశాలాంధ్ర - హొళగుంద: మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాల సాధన కోసం కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ వ్యవస్థాపకులు సిహెచ్ నాగరాజు ఆంధ్రప్రదేశ్ దళిత సమాఖ్య మండల అధ్యక్షులు నల్ల మల్లేష్‌లు అన్నారు. శుక్రవారం స్థానిక సీజనల్ హాస్టల్ నందు మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. దళిత నాయకులు హనుమంతు, లక్ష్మప్ప, శివ సిద్దప్ప, శేఖర్, మాల మల్లేష్, బుడగ జంగాల నాయకులు రంగన్న జంబయ్య పాల్గొన్నారు.

విశాలాంధ్ర - పెద్దకడబూరు : బహుజనుల మహిళా సాధికారిక సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిబా పూలే అని టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ కమిటీ సభ్యులు బొగ్గుల తిక్కన్న, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు యువరాజ్ మాదిగ, ఉపాధ్యక్షులు సతీష్ మాదిగ, బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు సామేలు, ఆర్గనైజింగ్ కార్యదర్శి రవికుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జాలవాడి, పెద్దకడబూరు గ్రామంలో టీడీపీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వేరువేరుగా జ్యోతిబాపూలే జయంతి వేడుకలు నిర్వహించారు.

కర్నూలు జీజీహెచ్‌లో జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవ కార్యక్రమం

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో శుక్రవారం ఉదయం గైనిక్ విభాగంలో నిర్వహించిన జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం సందర్భంగా ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గర్భిణులకు సరైన ఆరోగ్య సంరక్షణ, ప్రసవానంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తల్లి, బిడ్డ ప్రసవంతరం క్షేమంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గర్భవతి ఉన్నప్పుడు తీసుకోవాల్సిన పోషకాహారం, ప్రమాద సూచికలు తెలుసుకోవడం, గవర్నమెంట్ ఇచ్చే పదార్థాల గురించి అవగాహన కల్పించాలని, హాస్పిటల్లోనే ప్రసవాలు జరిగే విధంగా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి వసుపత్రి పీఎస్ఆర్ఎంఓ డా.వెంకటేశ్వరరావు, గైనిక్ విభాగపు హెచ్ఓడీ డా.శ్రీలక్ష్మి, గైనిక్ విభాగపు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త బ్యాంకు ప్రారంభించాలి

విశాలాంధ్ర - హొళగుంద: హొళగుందలో కొత్త ప్రభుత్వ బ్యాంక్ ప్రారంభించాలని ప్రజలు శుక్రవారం డిమాండ్ చేశారు. ఉన్న బ్యాంక్ సరిపోవడం లేదని, పనులు సక్రమంగా జరగడం లేదని ప్రజలు వాపోయారు. కొత్త బ్యాంకు ప్రారంభిస్తే రైతులకు, వ్యాపారస్తులకు, విద్యార్థులకు, పొదుపు లక్ష్మిమహిళలకు ఎంతో అనుకూలమవుతుందని ప్రజలు తెలిపారు. వ్యవసాయ రుణాలు పొందాలంటే ఎంతో కష్టంగా ఉన్నదన్నారు. జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకొని కొత్త బ్యాంకు ప్రారంభించి మేలు చేయాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేశారు.

ఆదివారం గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా : మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం 13న ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ మూర్తి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సత్యనారా యణమూర్తి మాట్లాడుతూ ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థిని విద్యార్థులు ఇంటర్నెట్, మీసేవ సెంటర్ల వద్ద హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవాలి అన్నారు. ఐదో తరగతి విద్యార్థులకు ఉదయం 9గంటలకు ప్రారంభం అవుతుందని ఆయన తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం ఒంటిగంటకు పరీక్ష ప్రారంభం అవుతుం దన్నారు. విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు ఆధార్ కార్డు, బ్లూ కలర్ లేదా బ్లాక్ కలర్ బాల్ పెయిన్ తీసుకొని పరీక్షకు హాజరు కావాలని తెలిపారు.

బాధితులకు అండగా పోరాడుతాం

- సీపీఐ మండల కార్యదర్శి బి.రాజు

విశాలాంధ్ర - కోడుమూరు: బండగట్టు గ్రామ దివ్యాంగులైన బాధితులకు అండగా నిలిచి వారికి న్యాయం జరిగే వరకూ పోరాడుతామని సీపీఐ కార్యదర్శి బి రాజు అన్నారు. సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య సూచన మేరకు ఆయన శుక్రవారం పట్టణంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో బండగట్టు దివ్యంగులైన బాధితులను కలుసుకొని కోడుమూరు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో వారికి జరిగిన అన్యాయంపై ఆరా తీశారు.ఈ సందర్భంగా సీపీఐ రాజు దివ్యాంగులను మోసగించిన వారిపై కఠిన చర్యలు తీసుకొని, వారి సమస్య పరిష్కారానికి సహకరించాలని కోరుతూ వారితో పాటు కోడుమూరు సీఐ తబ్రేజ్ ఎస్సై శ్రీనివాసులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులైన వీరిని మోసగించేందుకు బ్యాంకు మేనేజరు ఫీల్డ్ ఆఫీసర్ సహకరించడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం మానవత్వం కూడా లేకుండా ఇలాంటి దివ్యాంగులను మోసగించేందుకు బ్యాంకు సిబ్బంది సహకరించడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు.దివ్యంగుల సమస్య పరిష్కారానికి బ్యాంకు వద్ద పెద్ద ఎత్తున దివ్యాంగులను సమీకరించి ఆందోళన కార్యక్రమం చేపట్టి నిరసన వ్యక్తం చేసే దిశగా కార్యచరణ రూపొందిస్తామన్నారు. దివ్యాంగులకు న్యాయం జరిగే వరకు ఇంతవరకైనా, ఎలాంటి పోరాటాలకైనా సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బండగట్టు గ్రామ గ్రామస్తులు కురువ రాముడు, కురువ ధర్మారెడ్డి, శ్రీనివాసులు, వీరేషు బాదిత మహిళలు తదితరులు పాల్గొన్నారు.